సాక్షి
వికారాబాద్
గురువారం ౹ 7 ౹ సెప్టెంబర్ ౹ 2023



ఇంకెన్నాళ్లు..?

స్టేషన్‌ధారురు–దోర్నాల్ గ్రామాల మధ్య కాగ్నానదిపై వేసిన తాత్కాలిక రోడ్డు వరద ప్రవాహానికి దెబ్బతినింది. 8లో▸



పీఎస్‌కు వాస్తుదోషం..!

మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వాస్తుదోషం పట్టుకున్నట్టుంది. ఎన్నో ఏళ్లుగా ఉన్న పీఎస్ ప్రధాన గేటును మూసివేశారు. 8లో▸



లక్ష్యానికి తూట్లు

రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధుల మంజూరు చేస్తున్నా పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో దెబ్బతింటున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

కృష్ణయ్యకు సన్మానం



కృష్ణయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తదితరులు

పరిగి: ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందిన మండలంలోని రావులపల్లికి చెందిన చౌడూరి కృష్ణయ్యను బుధవారం ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తన నివాసంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృష్ణయ్య ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగంలో మారుతున్న నైతిక విలువులు.. ప్రభుత్వ ఉద్యోగులు అనే అంశంపై అధ్యయనం చేశారని తెలిపారు. కార్యక్రమంలో దోమ జెడ్పీటీసీ నాగిరెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు వెంకటయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, నాయకులు రామకృష్ణారెడ్డి, వెంకటయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఓటర్లను చేర్పించండి

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్

కొడంగల్: నియోజకవర్గంలో 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులను ఓటర్లుగా చేర్పించాలని అడిషనల్ కలెక్టర్, కొడంగల్ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి లింగ్యా నాయక్ సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో అఖిల పక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఓటరు జాబితాలో తప్పులు ఉంటే సరి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు విజయకుమార్, వెంకటేశ్, డిప్యూటీ తహసీల్దార్లు శివకుమార్,సురేష్, అఖిల పక్ష నాయకులు గుల్షన్, ఇందనూర్ బషీర్, మహమూద్, చంద్రప్ప, అశోక్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన ఎంపికలో జాగ్రత్తలు అవసరం

విత్తనాభివృద్ధి సంస్థ సీడ్స్ ఆఫీసర్ హరిణి



మహిళా రైతులకు విత్తనాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కుల్కచర్ల: విత్తన ఎంపికలో రైతులు జాగ్రత్తలు పాటించాలని, పొరపాటున నకిలీ విత్తనాలు కొనుగోలు చేస్తే నష్టాలు తప్పవని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ సీడ్స్ ఆఫీసర్ హరిణి అన్నారు. బుధవారం మండలంలోని బండవెల్కిచర్ల, కుల్కచర్ల తదితర గ్రామాలకు చెందిన మహిళా రైతులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారికి విత్తన ఎంపికపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వ గుర్తింపు పొందిన విత్తనాలనే కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం శోభ, మహిళ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ఆస్తిలో వాటా అడిగిందని..

- అక్కను అంతమొందించేందుకు సుపారీ ఇచ్చిన తమ్ముడు
- నిందితుడి అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

పరిగి: ఆస్తిలో వాటా అడుగుతున్న అక్కను చంపేందుకు సుపారీ ఇచ్చిన తమ్ముడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై సత్యనారాయణ కథనం మేరకు.. బసిరెడ్డిపల్లికి చెందిన బుచ్చయ్యకు ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. కూతురు ఆశమ్మను 16 ఏళ్ల క్రితం నవాబ్‌పేట మండలం గంగాడ గ్రామానికి చెందిన నర్సింహులుకు ఇచ్చి వివాహం చేశారు. కుటుంబ కలహాల కారణంగా ఆమె పదేళ్లుగా తల్లి వద్దే ఉంటోంది. ఇటీవల ఆమె తండ్రి ఆస్తిలో వాటా కావాలని తమ్ముడు రాజును కోరింది. దీంతో రాజు ఆమెను అంతమొందించాలని డేవిడ్ అనే వ్యక్తికి రూ.లక్ష సుపారీ ఇచ్చాడు. దీంతో ఆశమ్మ తమ్ముడిపై పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఫోన్ సంభాషణలు విన్న పోలీసులు రాజుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.



అధ్వానంగా మారిన వికారాబాద్ - సదాశివాపేట్ రోడ్డు

రోడ్లు వర్షార్పణం

భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులు

- వాహనదారులకు నరకయాతన
- మరమ్మతులకు మంజూరు కాని నిధులు

వికారాబాద్: నెల రోజుల క్రితం కురిసిన ఏకధాటి వర్షాలకు.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. గతంలో రోడ్ల మరమ్మతులకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. అయితే నిధులు మంజూరు కాలేదు. మరోసారి ప్రతిపాదనలు పంపేందుకు సిద్ధమవుతున్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నా కనీస మరమ్మతులు కూడా చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

మరమ్మతులకు నిధుల కొరత

జిల్లాలో గతేడాది కురిసిన వర్షాలకు పాడైన ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు ఆ శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. జిల్లా వ్యాప్తంగా 198 కిలో మీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయి. వీటిని పూర్తిస్థాయిలో బాగు చేసేందుకు రూ. 89 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. తాత్కాలిక మరమ్మతులకు రూ. 8కోట్లు అవసరమని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో 98కిలో మీటర్ల మేర పాడైన రోడ్లకు రూ. 39 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖకు రూ. 20 కోట్లు మంజూరయ్యాయి. అయితే టెండర్ల ప్రక్రియ దగ్గరే పనులు ఆగిపోయాయి. ఈ ఏడాది జిల్లాలో 57.7 కిలోమీటర్ల పంచాయతీ రాజ్ రోడ్లు పాడవగా రూ. 24.26 కోట్లు అవసరమని అధికారులు గుర్తించారు. మరో 20 కల్వర్టులకు రూ. 7.78 కోట్లు, 75 చోట్ల కోతకు గురైన రోడ్ల బాగు కోసం రూ. 32 కోట్లు అవసరమని గుర్తించిన అధికారులు ప్రతిపాదనలు పంపారు. జిల్లాలో 927 కిలో మీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్లు ఉండగా అందులో 18 కిలోమీటర్ల మేర పాడయ్యాయని గుర్తించారు. ఇందుకు కోసం రూ. 7.5కోట్లు అవసరమని గుర్తించి ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు రోడ్లు మరింత దెబ్బతిన్నాయి.

దెబ్బతిన్న రోడ్లు

జిల్లాలో ఒకటి, రెండు రోడ్లు మినహా మెజారిటీ రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. వికారాబాద్ - పరిగి, వికారాబాద్ - నవాబుపేట, వికారాబాద్ - సిద్దులూర్, వికారాబాద్ - బుగ్గదేవాలయం దారి, వికారాబాద్ - తాండూరు రహదారి, కొడంగల్ - తాండూరు, కొడంగల్ - మహబూబ్‌నగర్, పరిగి - మిట్టకోడూర్, దోమ మండలంలోని దోర్నాల్‌పల్లి - గొడుగోనిపల్లి, ఐనాపూర్–పాలెపల్లి, గడిసింగాపూర్–మల్లెపల్లి, పరిగి–షాద్‌నగర్, వికారాబాద్– సదాశివాపేట్, కోటాలగూడ - లాల్‌సింగ్ తండా, మన్నెగూడ - మిర్జాపూర్ మీదుగా లల్‌సింగ్ తండా తదితర రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. ఈ మార్గాల్లో ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. అంతేకాకుండా వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సెటిల్మెంట్లే డ్యూటీ!

శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన కొంతమంది పోలీసు అధికారులు నిత్యం సివిల్ (భూములు)వివాదాల్లో తలదూరుస్తున్నారు. బడా నేతలు, రియల్టర్లకు కొమ్ము కాస్తూ.. రైతులు, మధ్యతరగతి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. అంతటితో ఆగకుండా అధికారాన్ని అడ్డం పెట్టుకుని తప్పుడు కేసులు బనాయిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి ఒకరిద్దరి కారణంగా పోలీసు శాఖకే చెడ్డ పేరు వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



- పరిగి సర్కిల్‌లో ఓ పోలీసు అధికారి వింతధోరణి
- భద్రతా వ్యవహారలను వదిలేసి.. భూ వివాదాల్లో జోక్యం
- అమాయకులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపణ

పరిగి: భూ వివాదాల్లో పోలీసులు తలదూర్చి బాధితులపై కేసులు పెడుతూ బెదిరింపులకు దిగుతున్నారన్న విమర్శలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. కొందరు పోలీసులు రియల్ వ్యాపారం చేస్తూ సివిల్ వివాదాల్లో తలదూరుస్తూ శాంతి భద్రతలను గాలికి వదిలేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ కేసులపై ఆందోళన చెందిన కొందరు యువకులు ఇటీవల ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించిన విషయం తెలిసిందే.. గతంలో కూడా ఈ ప్రాంతంలో పోలీసులపై ఇలాంటి ఆరోపణలు చాలా వచ్చాయి. నియోజకవర్గంలో ఎక్కడి భూ పంచాయితీ అయినా పరిగిలోని ఓ పోలీసు అధికారి జోక్యం చేసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.సైలెంట్‌గా ఇల్లీగల్ పనులను చక్కబెడుతూ బాధితులపైనే కేసులు పెడుతూ అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది అధికారుల తీరుతో పోలీసు వ్యవస్థకే మచ్చ వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన పోలీసు అధికారే నిత్యం భూ దందాలు చేస్తూ రియల్టర్లకు కొమ్ము కాస్తూ పేదలకు అన్యా యం చేస్తున్నారని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బాధితులపైనే కేసులు

రియల్టర్లకు కొమ్ము కాస్తున్న ఓ పోలీసు అధికారి.. వారు ఎలా చెబితే అలా చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. రియల్టర్లు బెదిరింపులకు గురిచేస్తున్నారని ప్రజలు పోలీసులను ఆశ్రయిస్తే వారిపైనే అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని పలువురు అంటున్నారు. పదుల సంఖ్యలో బాధితులపై కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. పరిగి, దోమ, పూడూరు మండలాల్లో ఇలాంటి సంఘటనలు నిత్యం చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల పరిగిలో జరిగిన భూ అగ్రిమెంట్ గొడవలో పోలీసుల పాత్ర కీలకంగా ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. పోలీసులు డబ్బులకు ఆశ పడి బాధితులకు అన్యాయం చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

రాజకీయ నాయకుల అండదండలతో..

రాజకీయ నాయకుల అండదండలతో ఓ పోలీసు అధికారి ప్రతి భూ తగాదాలో జోక్యం చేసుకుంటున్నాడని పలువురు చర్చించుకుంటున్నారు. రియల్ వ్యాపారులకు కొమ్ముకాస్తూ బాధితులపైనే కేసులు నమోదు చేస్తున్నాడని ఆరోపిస్తున్నారు. విధులు కూడా సక్రమంగా నిర్వహించకుండా మొత్తం వ్యాపారంపైనే దృష్టి పెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న పోలీసు అధికారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు. ఈ విషయమై డీఎస్పీ కరుణ సాగర్‌రెడ్డిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

నిరవధిక సమ్మెకు అంగన్‌వాడీలు సై

అనంతగిరి: సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11నుంచి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్నట్లు ఆ యూనియన్ జిల్లా నాయకులు తెలిపారు. బుధవారం ఈ మేరకు కలెక్టరేట్‌లో ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కనీస వేతనం, పీఎఫ్, పింఛను సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ,కోశాధికారి లక్ష్మి, నాయకులు భారతి, పార్వతమ్మ, మంజుల పాల్గొన్నారు.



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

11 మంది వైద్యులకు పదోన్నతులు



తాండూరు: పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు పదోన్నతులు లభించాయి. డాక్టర్ రవిశంకర్, కేవీఎన్ మూర్తి, ప్రవీణ్‌గౌడ్, శరత్‌చంద్రలకు డిప్యూటీ సివిల్ సర్జన్లుగా పదోన్నతి లభించింది. అలాగే మాతా శిశు ఆస్పత్రి వైద్యులు రబియా, అనిత, దుర్గలత, శిరీషలకు డిప్యూటీ సివిల్ సర్జన్లుగా పదోన్నతి లభించింది. మర్పల్లి సీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న ప్రశాంత్, పరిగి సీహెచ్‌సీలో పని చేస్తున్న సాజియా, వికారాబాద్ ఏరియా ఆసుపత్రి వైద్యులు శాంతప్పలకు డిప్యూటీ సివిల్ సర్జన్లుగా పదోన్నతి లభించినట్లు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ప్రదీప్ తెలిపారు. అయితే డిప్యూటేషన్‌పై వెళ్లిన వైద్యులు రబియా, దుర్గలతకు పదోన్నతి లభించడంతో తిరిగి వస్తారా.. అక్కడే కొనసాగుతారా అనేది తెలియాల్సి ఉంది.

15న వైద్య కళాశాల ప్రారంభం



వైద్య కళాశాల ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశం
- కళాశాల భవనాలు పరిశీలన

వికారాబాద్ అర్బన్: ఈ నెల 15న వైద్య కళాశాల ప్రారంభిస్తున్నందున అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతగిరిలోని వైద్య కళాశాల భవనాలు, అక్కడి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 15న ముఖ్యమంత్రి కేసీఆర్ వర్చువల్‌గా కళాశాలను ప్రారంభిస్తారని తెలిపారు. అప్పటిలోగా అవుట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కళాశాల ఆవరణలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని డిప్యూటీ ఇంజనీర్ లక్ష్మీనారాయణకు సూచించారు. 20 రోజుల్లో పనులు పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించుకొని, రోజు వారి పనుల వివరాలను అదనపు కలెక్టర్‌కు నివేదిక రూపంలో ఇవ్వాలని సంబంధిత కాంట్రాక్టర్, డీఈకి సూచించారు. కళాశాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కేజీబీవీ పాఠశాలను సందర్శించి వసతి గృహంలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. మూత్రశాలలు, తలుపులు, కిటికీలు, ఇతర మరమ్మతు పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారి రాజుకు సూచించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మశాల్ మాలిని, సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రయ్య, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ప్రదీప్ కుమార్, డీఎస్డీఓ మల్లేశం, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి

జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలన్నారు. హరితహారంలో నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని ఆదేశించారు. గ్రీన్ బడ్జెట్‌ను మొక్కల సంరక్షణకు మాత్రమే వినియోగించాలని, ఇతర పనులకు ఖర్చు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. అలాగే మన ఊరు – మన బడి పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, ఆర్డీవో కృష్ణన్, డీపీఓ తరుణ్ కుమార్, జెడ్పీ సీఈవో సుభాషిని, డీఈవో రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

కళాశాల సూపరింటెండెంట్‌గా డాక్టర్ రామచంద్రయ్య

వికారాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల సూపరింటెండెంట్‌గా డాక్టర్ రామచంద్రయ్యను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణంలోని కొత్తగడికి చెందిన డాక్టర్ రామచంద్రయ్య ఉస్మానియా వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, నిజామాబాద్ వైద్య కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు.ఏడాది నుంచి వికారాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలోని జనరల్ సర్జన్ విభాగం హెచ్‌ఓడీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయనకు కళాశాల సూపరింటెండెంట్ బాధ్యతలు అప్పగించారు.

కులసంఘాలకు గౌరవం

- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

బొంరాస్‌పేట: ఒకప్పుడు కులసంఘాలు వివక్షతకు గురవుతూ వచ్చాయని, సీఎం కేసీఆర్ పాలనలో వారికి ఎనలేని గౌరవం, సహకారం అందుతోందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మెట్లకుంటలో వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రూ. 20లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనానికి, రూ. 15లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి, రూ. 5లక్షలతో కురువ యాదవ సంఘం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని అన్నారు. యువకుల కోరిక మేరకు ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. విగ్రహ ప్రతిష్ఠాపనకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ నారాయణ, ఎంపీటీసీ నర్సింలు, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, యాదగిరి, రమణారెడ్డి, బీ శ్రీనివాస్, రవిగౌడ్, వెంకటయ్య, డీ శ్రీనివాస్ రాజీవ్, అశోక్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



మెట్లకుంటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తదితరులు

ఎట్టకేలకు మోక్షం

- కృష్ణా – వికారాబాద్ రైల్వే లైన్‌కు అనుమతులు
- 112 కి.మీ. నిర్మాణానికి రూ.2,196 కోట్లు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా వాసులు



తాండూరు రైల్వేస్టేషన్

కొడంగల్: కృష్ణా - వికారాబాద్ రైల్వే లైన్‌కు ఎట్టకేలకు మోక్షం లభించింది. దీంతో నాలుగు దశాబ్దాల కొడంగల్ ప్రజల నిరీక్షణ ఫలించింది. వికారాబాద్ నుంచి కొడంగల్ నియోజకవర్గం మీదుగా కృష్ణా వరకు 112 కిలో మీటర్ల మేర కొత్తగా రైల్వే లైన్ నిర్మించనున్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ. 2,196 కోట్ల అంచనాలతో నిధులు మంజూరు చేసింది. కొడంగల్ మీదుగా రైల్వే లైన్ పనులు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. గతంలో సర్వే చేసి కేంద్రానికి నివేదిక కూడా సమర్పించారు. కొడంగల్ మీదుగా రైల్వే లైన్ వేస్తే ఆ శాఖకు ఎంతో లాభం చేకూరుతుందని రుజువులతో సహా నివేదికలు అందించారు. అప్పటి మహబూబ్‌నగర్ ఎంపీ జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలుమార్లు కొడంగల్ అఖిల పక్ష నాయకులు కేంద్ర, రాష్ట్ర అధికారులను కలిసి వినతి పత్రాలు సమర్పించారు.

112 కిలో మీటర్లు.. రూ. 2,196 కోట్లు

కృష్ణా – వికారాబాద్ రైల్వే లైన్ ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక. 1980 –81 సంవత్సరంలో అప్పటి మహబూబ్‌నగర్ ఎంపీ, రైల్వేశాఖ సహాయ మంత్రి మల్లికార్జున్ సర్వేకు ఆదేశించారు. వికారాబాద్ నుంచి పరిగి, దోమ, సర్జఖాన్‌పేట, మద్దూరు, నారాయణపేట, ఊట్కూర్, మక్తల్, మాగనూర్ మీదుగా కృష్ణా వరకు రైల్వేలైన్ నిర్మించాలని మొదటగా సర్వే చేశారు. అయితే కొడంగల్ ప్రజల డిమాండ్ మేరకు రెండో సారి సర్వేకు కేంద్రం ఆదేశించింది. కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మీదుగా రైల్వే లైన్ వేస్తే ఆదాయం వస్తుందని గణాంకాలను విశ్లేషిస్తూ ఇక్కడి ప్రజలు, స్థానిక అధికారులు కేంద్రానికి నివేదిక పంపించారు. వికారాబాద్, పరిగి, బొంరాస్‌పేట, కొడంగల్, కోస్గి, మద్దూరు, నారాయణపేట, మక్తల్ మీదుగా కృష్ణా వరకు రైల్వే లైన్ వేస్తే లాభసాటిగా ఉంటుందని నిపుణులు నివేదిక సమర్పించారు. అనంతరం జరిగిన పరిణామాల వల్ల రాష్ట్ర విభజన, ఆ తర్వాత జిల్లాల పునర్విభజన జరిగింది. నియోజకవర్గంలోని కోస్గి, మద్దూరు మండలాలు మహబూబ్‌నగర్ జిల్లాలోకి వెళ్లాయి. కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాలు వికారాబాద్ జిల్లా పరిధిలోకి వచ్చాయి. నాటి నుంచి రైల్వే విషయంలో జాప్యం జరిగింది.

భూ సేకరణ చేయాలి



కొడంగల్ మీదుగా రైల్వే లైన్ వేయడానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి భూమిని సేకరించాలి. ఈ ప్రాజెక్టు పూర్తయితే జిల్లాలోని పరిగి, కొడంగల్ నియోజకవర్గాలకు ఎంతో మేలు జరుగుతుంది. పలువురికి ఉపాధి లభిస్తుంది. వ్యాపారాలు పెరుగుతాయి.

– పున్నం చంద్ లాహోటీ, బీజేపీ నేత, కొడంగల్

కొడంగల్ మీదుగా వేయాలి



వికారాబాద్ – కృష్ణా రైల్వే లైన్ కొడంగల్ మీదుగా వేయాలి. నియోజకవర్గంలో ఇప్పటికే రెండు జాతీయ రహదారులు ఉన్నాయి. రైల్వే లైన్ అందుబాటులోకి వస్తే రవాణా వ్యవస్థ మెరుగు పడుతుంది. ఇప్పటికైనా కేంద్రం నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని రైల్వే లైన్ నిర్మాణానికి సహకరించాలి.

– మురహరి వశిష్ఠ, కొడంగల్ వాసి

క్లుప్తంగా

నీళ్లు తాగేందుకు వెళ్లి.. వ్యక్తి మృతి


చేతిపంపు వద్ద బాలు మృతదేహం

పెద్దేముల్: నీరు తాగేందుకు వెళ్లిన వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం పెద్దేముల్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కాశీనాథ్, గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. తాండూరు ప్రాంతానికి చెందిన లాలు(58) పదేళ్లుగా జల్లెడలు తయారు చేసి విక్రయిస్తూ వచ్చిన డబ్బుతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయన పదిరోజుల క్రితం గ్రామానికి వచ్చి పంచాయతీ కార్యాలయం సమీపంలో జల్లెడలు తయారు చేసి విక్రయాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం పంచాయతీ కార్యాలయం వెనుక వైపున్న చేతిపంపు(బోరింగ్) వద్దకు నీరు తాగేందుకు వెళ్లి అక్కడే చనిపోయాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసు, పంచాయతీ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం పంచాయతీ ట్రాక్టర్లో వేసుకుని తాండూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య అంబమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళను బెదిరించి..

- బంగారు గుండ్లు చోరీ
- ఆటో డ్రైవర్‌కు రిమాండ్


నిందితుడు యేసు

మోమిన్‌పేట: ఆటో ఎక్కిన మహిళను బెదిరించి బంగారు గుండ్లను చోరీ చేసిన డ్రైవర్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ విఠల్ రెడ్డి తెలిపిన ప్రకారం.. చేవెళ్ల మండలం రేగడి ఘనాపూర్ గ్రామానికి చెందిన నాగమ్మ ఈ నెల 2న మండల పరిధిలోని సయ్యద్ అల్లీపూర్ గ్రామంలోని తన కూతురు వద్దకు వెళ్తోంది. ఆమె మోమిన్‌పేట్ బస్టాండ్‌లో వేచియుండగా.. కోటపల్లి మండలం బార్వాద్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ తాను అటే వెళ్తున్నానని నమ్మించి ఆటో ఎక్కించుకుని బయలుదేరాడు. మార్గమధ్యలో మొరంగపల్లి శివారులోని గుట్ట పైకి తీసుకెళ్లి కత్తితో బెదిరించి మెడలోని బంగారు గుండ్లను దొంగిలించి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ఆటో నెంబర్ ట్రేస్ చేశారు. డ్రైవర్ యేసుపై నిఘా ఉంచారు. బుధవారం నిందితుడు బంగారు గుండ్లను అమ్మేందుకు మోమిన్‌పేటలోని ఓ జ్యూవెలరీ దుకాణానికి రాగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసు విచారణలో నేరాన్ని ఒప్పుకున్నాడు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. గతంలోనూ ఓ వ్యక్తిని ఆటోలో ఎక్కించుకుని రూ.10వేలు దొంగలించిన ఘటనలోనూ జైలుకు వెళ్లినట్లు తెలిసింది.

ఏటీఎంలో చోరీకి యత్నం


దొంగలు ధ్వంసం చేసిన ఏటీఎం మిషన్

కొడంగల్ రూరల్: పట్టణంలోని బస్టాండులో ఏర్పాటు చేసిన ఇండియన్ బ్యాంక్ ఏటీఎంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి యత్నించారు. డబ్బుల కోసం ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేశారు. అయినా అది ఓపెన్ కాకపోవడంతో అక్కడి నుంచి జారుకున్నారు. ఏటీఎం నిర్వాహకుడు నందకిషోర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాలకిషన్ తెలిపారు.

తండా రోడ్లకు రూ.11.65 కోట్లు

మహేశ్వరం: ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో మహేశ్వరం నియోజకవర్గంలోని తండాలకు బీటీ రోడ్లు నిర్మించేందుకు రూ.11.65 కోట్ల నిధులు మంజూరయ్యాయని మంత్రి సబితారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటితో మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని గ్రామాలు, ప్రధాన రహదారుల నుంచి ఆయా తండాలకు బీటీ రోడ్లు నిర్మిస్తామని పేర్కొన్నారు.

ఇంకెన్నాళ్లు..?

- వర్షం కురిస్తే డైవర్షన్ రోడ్డు ధ్వంసం
- వాహనాలకు నో ఎంట్రీ
- ఇబ్బంది పడుతున్న స్టేషన్‌ధారూరు–దోర్నాల్ ప్రజలు
- పట్టించుకోని పాలకులు


డైవర్షన్ రోడ్డు దుస్థితి

ధారూరు: సర్పన్‌పల్లి, లక్నాపూర్ ప్రాజెక్టులు పూర్తిగా నిండిపోయి వాటి అలుగుల ద్వారా వస్తున్న వరదనీరు కాగ్నానదిలో కలిసి ప్రవహించడంతో వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శనివారం రాత్రి నుంచి నిరంతరంగా కురుస్తున్న వర్షానికి స్టేషన్‌ధారూరు–దోర్నాల్ మధ్య కాగ్నానదిపై నిర్మించిన తాత్కాలిక డైవర్షన్ రోడ్డు మళ్లీ దెబ్బతినడంతో రాకపోకలు స్తంభించాయి. పాదాచారులు అతికష్టంగా సీసీ పైపుల మీదుగా కర్ర సహాయంతో నడుస్తూ రాకపోకలు సాగిస్తున్నారు. డైవర్షన్ రోడ్డుపై వేసిన మట్టి కొట్టుకుపోవడంతో సీసీ పైపులు తేలాయి. వాటిపై నుంచి ఇంకా నీటి ప్రవాహం కొనసాగుతుండడం, రాళ్లు తేలడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న దోర్నాల్ గ్రామం నుంచి ధారూరుకు ప్రయాణించాలంటే 35 కిలోమీటర్లు అదనంగా తిరిగాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

నిధులు మంజూరైనా పూర్తవ్వని పనులు

2016లో పాత వంతెన నీటి ప్రవాహ ఉధ్రుతికి పాడయింది. దీంతో దాని స్థానంలో కొత్తగా వంతెన నిర్మించడానికి 2017లో రూ.4.70 కోట్ల నిధులు మంజూరు చేశారు. అదే ఏడాది పనులు ప్రారంభించినా నేటకీ పూర్తవ్వడం లేదు. వంతెన పక్కన నిర్మించిన డైవర్షన్ రోడ్డుపై వేసిన మట్టి కాగ్నానది ఉధ్రుతికి కొట్టుకుపోవడం.. రాకపోకలు నిలిచిపోవడం సర్వసాధారణమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు విన్నవించినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మా వాటా మాకు దక్కాల్సిందే..

- అన్ని పార్టీలు జిల్లాలో ఇద్దరు బీసీలకు టికెట్ కేటాయించాలి
- తాండూరులో బీఆర్ఎస్ బీఫాం బీసీలకు ఇవ్వాలి
- 10న బీసీల సింహగర్జన
- బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌గౌడ్


మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

తాండూరు టౌన్: మేమెంతో మాకంత వాటా దక్కాలని.. ప్రతీ పార్టీ జిల్లాలో రెండు అసెంబ్లీ టికెట్లు బీసీలకు కేటాయించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈడిగి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం బీసీ విద్యార్థి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో బీసీల సింహగర్జన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాలకు రిజర్వుడు స్థానం మినహా అన్ని మూడు స్థానాల్లోనూ రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్కువ జనాభా ఉన్న అగ్రవర్ణాలకు టికెట్లు ఇచ్చి జనాభాలో 50శాతం ఉన్న బీసీ అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాండూరులో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకే టికెట్ కేటాయించాలని, ఇప్పటికే టికెట్ ఖరారు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలకు బీఫాం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. జనాభా దామాషా ప్రకారం టికెట్లు ఇవ్వకుంటే వచ్చే ఎన్నికల్లో బీసీల సత్తా చాటుతామని హెచ్చరించారు. ఇందుకు ఈ నెల 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న బీసీల సింహగర్జనకు బహుజనులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. అనంతరం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అంజి.వెంకటేశ్‌గౌడ్, అల్తాఫ్, నర్సింహులు, వంశీ, శ్రీకాంత్ గౌడ్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పీటీసీలో మరమ్మతులు చేపట్టండి

ఎస్పీ కోటిరెడ్డి


పోలీసు శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: పోలీస్ శిక్షణ కేంద్రంలో మరమ్మతులను తక్షణమే పూర్తి చేయాలని ఎస్పీ కోటిరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన వికారాబాద్‌లోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో శిక్షణ పొందేందుకు 215 మంది పోలీసు అభ్యర్థులు రానున్నారని.. అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలన్నారు. శిక్షణకు వచ్చే అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా పరేడ్ గ్రౌండ్ , బ్యారెక్‌లు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, తరగతి గదులు, కిచెన్ తదితరాలను పరిశీలించారు. ఆయన వెంట పీటీసీ ప్రిన్సిపాల్ మురళీధర్, వైస్ ప్రిన్సిపాల్ విజయ్, లా ఇన్‌స్ట్రక్టర్ పరమేశ్వర్, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో యువమంచ్ ముందంజ

డాక్టర్ జయప్రసాద్


రిటైర్డ్ ఉపాధ్యాయులు, విద్యార్థులను సన్మానిస్తున్న మార్వాడీ యువమంచ్ సభ్యులు

తాండూరు టౌన్: సేవా కార్యక్రమాల్లో మార్వాడీ యువమంచ్ సభ్యులు ముందంజలో ఉంటారని డాక్టర్ జనార్దన్ అన్నారు. మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తాండూరు మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల రిటైర్డ్ ఉద్యోగులు, పది, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన మార్వాడీ సమాజానికి చెందిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్వాడీ యువమంచ్ సేవలు అభినందనీయమన్నారు. యువమంచ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు మన్మోహన్ సార్దా మాట్లాడుతూ.. 34 ఏళ్లుగా మంచ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను, విద్యార్థులను సన్మానిస్తున్నామన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు అనంతరెడ్డి, జెసింతాబాస్కో,టిలూథ్‌రాజు, రాజంమరియా, శివరాజ్, ఉమాదేవిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో రమేశ్‌చంద్ర సార్దా, సంతోశ్‌రాఠీ, సన్నీ అగర్వాల్, బ్రిజ్‌మోహన్ బూబ్, కిషన్ రాఠీ, అరుణ్ సార్దా తదితరులు పాల్గొన్నారు.

సాగులో మెలకువలు తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి గోపాల్


పంట నమోదు చేస్తున్న గోపాల్

దోమ: రైతులు సాగు చేసిన పంటల్లో మెలకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని బట్లచందారం గ్రామంలో పంట నమోదు ప్రక్రియలో భాగంగా రైతులు సాగు చేసిన వరి, పత్తి పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ పంటలను రక్షించుకోవాలన్నారు. వర్షాల పట్ల అప్రమత్తంగా ఉంటూ పంటలకు అవసరమైన మందులను పిచికారీ చేయాలన్నారు. ప్రతీ రైతు తాను సాగు చేసిన పంటల వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులతో నమోదు చేయించుకునేందుకు శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్ రావు, ఏఈఓ చెన్నయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మార్పీఎస్ అత్యవసర సమావేశం

సంఘం జిల్లా కన్వీనర్ నర్సింహ

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని వాడ్యాల వసంతరెడ్డి ఫంక్షన్ హాల్‌లో గురువారం ఎమ్మార్పీఎస్ జిల్లా స్థాయి అత్యవసర సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా కన్వీనర్ పెంటనోళ్ల నర్సింహ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు మధ్యాహ్నం 12గంటలకు నిర్వహిస్తున్న సమావేశానికి అతిథులుగా ఎంఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్ హాజరు కానున్నారని తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఉంటుందన్నారు.

మట్టిలో మాణిక్యం.. అమూల్య

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి


అమూల్యరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కుల్కచర్ల: నీట్‌లో అర్హత సాధించి ఎంబీబీఎస్ సీటు సాధించిన అమూల్యరెడ్డి మట్టిలో మాణిక్యమని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆమెను పార్టీనేతలు ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో ఆమె మరింత ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఆనందం, నాయకులు వెంకటయ్య, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, బాల్‌రెడ్డి, రాంరెడ్డి, భరత్‌కుమార్, రాములు, ఆంజనేయులు, కృష్ణయ్య, రవి, అంజి తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల టికెట్ కేటాయించండి

కాంగ్రెస్ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధేశ్వర్

మొయినాబాద్: చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్‌కు తనకే కేటాయించాలని పీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల సిద్ధేశ్వర్ కోరారు. బుధవారం ఆయన మొయినాబాద్‌లోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 20ఏళ్లుగా కాంగ్రెస్‌లో వివిధ హోదాల్లో పనిచేస్తున్నానన్నారు. 2009 ఎస్సీసెల్ విభాగంలో రాష్ట్ర వ్యాప్తంగా దళిత చైతన్య బస్సు యాత్ర చేపట్టానన్నారు. 450 కిలో మీటర్లు పాదయాత్ర చేపట్టి అనేక గ్రామాల్లో సర్పంచ్‌ల సమస్యలపై పోరాటం చేశానన్నారు. ప్రస్తుతం చేవెళ్ల టికెట్‌కోసం చాలా మంది దరఖాస్తు చేసుకున్నారని కానీ అధిష్టానం తనను గుర్తించి టికెట్ ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రేపు క్రీడా పోటీలు

షాద్‌నగర్: పట్టణంలోని మినిస్టేడియంలో ఈ నెల 8న క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 17 విభాగాల్లో బాలబాలికలకు ఖోఖో, 14, 17 విభాగంలో బాలురకు క్రికెట్, లాంగ్ జంప్, షాట్‌పుట్, పరుగుపందెం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8గంటలకు ప్రారంభం అవుతాయని, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, టీం మేనేజర్లు సకాలంలో చేరుకోవాలని ఆయన కోరారు.

పోలీస్ స్టేషన్‌కు వాస్తుదోషం!


మొయినాబాద్ పీఎస్ ప్రధాన గేటు తీయకుండా పోసిన మట్టి

ప్రధాన గేటు మూసివేసిన వైనం

మొయినాబాద్: మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వాస్తుదోషం పట్టుకున్నట్టుంది. ఎన్నో ఏళ్లుగా ఉన్న పీఎస్ ప్రధాన గేటును మూసివేశారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పక్కనున్న మొయినాబాద్ పీఎస్ ప్రధాన ద్వారం ఠాణాకు ఎదురుగా దక్షిణం వైపు ఉంది. కానీ రెండు నెలల క్రితం మొయినాబాద్ పీఎస్‌కు కొత్త ఇన్‌స్పెక్టర్ వచ్చిన తర్వాత దక్షిణం వైపు ఉన్న గేటు మూసి మట్టి పోశారు. స్టేషన్‌కు తూర్పు వైపు ఉన్న పెట్రోల్ బంక్ పక్క నుంచి స్టేషన్‌లోని వెళ్లేలా కంచెను తొలగించి చదును చేయించారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో కొత్తగా ఏర్పాటు చేసిన దారి బురదమయంగా మారి వచ్చిపోయేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఇది చూసినవారు పోలీస్‌స్టేషన్‌కు వాస్తుదోషం పట్టిందని.. అందుకే గేటును పూర్తిగా మూసివేశారని చర్చించుకుంటున్నారు.

అధికార పార్టీ వారికే పథకాలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

- అర్హులకు మొండి చేయి
- పరిగి నియోజకవర్గ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్

కుల్కచర్ల: ప్రభుత్వ పథకాలు బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకే అర్హుందరికీ ఇవ్వాలని పరిగి నియోజకవర్గ పరిరక్షణ సమితి సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో కాంగ్రెస్, బీజేపీ నేతలతో కలిసి ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికార పార్టీలో పనిచేస్తున్న వారికి తప్పా.. నిరుపేదలకు ఎటువంటి సంక్షేమ పథకాలు అందడం లేదని ఆరోపించారు. ఈ నెల 13న మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామన్నారు. నియోజకవర్గానికి చెందిన పథకాలని పొందని ప్రజలంతా పెద్ద ఎత్తున హాజరవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బ్లాక్–2 అధ్యక్షుడు భరత్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు మైపాల్, బీజేవైఎం మండల అధ్యక్షుడు జి.మైపాల్, మండల ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు షర్ఫొద్దీన్, చంద్రలింగం, వెంకటేశ్, ముకుంద, అంజి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో ఆర్థిక పురోగతి

జిల్లా పశువైద్యాధికారి అంజిలప్ప


జీవాలను పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి అంజిలప్ప

కొత్తూరు: ప్రభుత్వ పథకాలతో పేదలు ఆర్థిక పురోగతి సాధించాలని జిల్లా పశువైద్యాధికారి అంజిలప్ప అన్నారు. మండల పరిధిలోని తీగాపూర్ గ్రామంలో బుధవారం రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని మల్లికార్జున గొర్రెల పెంపకందారుల సంఘంలోని 24మంది గొర్రెల యూనిట్లు పొందేందుకు తమ వాటా ప్రభుత్వానికి చెల్లించారన్నారు. కాగా వారిలో ఆరుగురు సభ్యులకు ఆరు యూనిట్ల (126)గొర్రెలు వచ్చాయని చెప్పారు. జీవాలు ఇతర ప్రాంతాల నుంచి తెచ్చినందున వాటిని జాగ్రత్తగా పరిశీలించాలని కాపరులకు సూచించారు. స్థానిక వాతావరణం అలవాటు పడే వరకు వైద్య పరీక్షలు చేయించాలన్నారు. గొర్రెలు, మేకల పెంపకంలో పశువైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తే మంచి లాభాలు సాధించన్నారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యురాలు స్ఫూర్తి, సర్పంచ్ రమాదేవి, సంఘం సభ్యులు సాయన్న, రమేశ్, నాయకులు మెండె కృష్ణ, బాలయ్య, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు, రైతులకు అండగా ఉంటాం

డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి


బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న మనోహర్‌రెడ్డి

కుల్కచర్ల: నిరుపేద ప్రజలకు, రైతు కుటుంబాలకు తాము అండగా ఉంటామని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన బల్ల యాదగిరిగౌడ్ ఆకస్మికంగా మృతిచెందారు. విషయం తెలుసుకున్న మనోహర్‌రెడ్డి బుధవారం బాధిత కుటంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యత్వం ఉన్న రైతులు మృతిచెందిన సందర్భంలో అంత్యక్రియలకు రూ.9వేల ఆర్థికసాయం అందజేస్తామన్నారు. అదేవిధంగా ఆకస్మికంగా మృతిచెందిన రైతుల కుటుంబాలకు సహకార సంఘాల తరపున మరియు తమ వ్యక్తిగతంగా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రాంలాల్, రాంచంద్రయ్య, శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

మెదక్, సిద్దిపేట రైల్వే లైన్లను కలపాలి


దక్షిణ మధ్య జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ కలిసిన మంత్రి హరీశ్‌రావు

మెదక్: ఔటర్ రింగ్ రైల్వే ప్రాజెక్టులో మెదక్–సిద్దిపేట లైన్లను కలపాలని మంత్రి హరీశ్‌రావు కోరారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో రైల్వే పెండింగ్ పనుల అంశంపై బుధవారం దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. సిద్దిపేట నుంచి తిరుపతి, బెంగళూర్ వంటి నగరాలకు రైళ్లను ప్రారంభించాలని కోరారు. అలాగే హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు పుష్పుల్ ప్యాసింజర్ రైళ్లను నడపాలని కోరారు. కొత్తగా నిర్మించిన సిద్దిపేట రైల్వేలైను ఈనెల 15న, రైల్వే సేఫ్టీ కమిషనర్ పరిశీలించనున్నారని, అదిపూర్తి కాగానే ప్యాసింజర్ రైళ్లను ప్రారంభించాలని మంత్రి కోరారు. కొమురవెల్లి మల్లన్న ఆలయం వద్ద కొత్త రైల్వేస్టేషన్ పనులతో పాటు మెదక్ జిల్లా మాసాయిపేటలో రైల్వే పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విన్నవించారు. దేశచరిత్రలోనే సిద్దిపేట రైల్వేలైన్ నిర్మాణం అత్యంత వేగంగా పూర్తి అయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణకు చొరవ చూపడతంతోనే సాధ్యమైందని చెప్పారు. తెలంగాణలో నిర్మించనున్న ఔటర్‌రింగ్ రోడ్డు ప్రాజెక్టులో మెదక్, సిద్దిపేటలను కలపాలని సూచించారు. పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో పెట్టుకుని మెదక్, సిద్దిపేట మీదుగా ఔటర్‌రింగ్ రైల్వేలైన్ నిర్మించాలని మంత్రి కోరారు. రూ.250 కోట్లతో 2 వేల ఎకరాల భూసేకరణ చేసి రాష్ట్ర ప్రభుత్వం రైల్వేశాఖకు అప్పగించినట్లు మంత్రి వివరించారు. ఆయన వెంట ఎంపీ ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు. మంత్రి వినతిపై దక్షిణమధ్య జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ సానుకూలంగా స్పందించారు.

జహీరాబాద్–తాండూర్ మధ్య కొత్త రైల్వే లైన్

జహీరాబాద్: సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ నుంచి వికారాబాద్ జిల్లాలోని తాండూర్‌ల మధ్య కొత్త రైల్వేలైన్‌కు ఎఫ్ఎల్ఎస్ మంజూరయింది. ఇందుకోసం రూ.1,350 కోట్ల మేర నిధులు అవసరం అవుతాయని అంచనా వేసింది. రైల్వే లైన్ నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వస్తే జహీరాబాద్–తాండూర్ మధ్య దూరం 65 కిలోమీటర్లు తగ్గనుంది. ప్రస్తుతం జహీరాబాద్ నుంచి వికారాబాద్ మీదుగా తాండూర్‌కు రైళ్ల రాక పోకలు సాగిస్తున్నాయి. దీంతో ప్రయాణికులకు అదనపు దూర ప్రయాణం తప్పడం లేదు. రైల్వే మంత్రిత్వ శాఖ రైళ్ల అనుసంధానాన్ని బలోపేతం చేసేందుకు దృష్టి సారించింది. రాష్ట్రంలో దాదాపు 15 కొత్త రైల్వేలైన్ల కోసం ఫైనల్ లొకేషన్ సర్వే(ఎఫ్ఎల్ఎస్)ను మంజూరు చేసింది. అందులో భాగంగానే జహీరాబాద్ నుంచి తాండూర్‌లోని సిమెంట్ క్లస్టర్ల వరకు లైను నిర్మాణం చేపట్టనున్నారు. అయా ప్రాంతాల మధ్య 75 కిలోమీటర్ల మేర నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందని రైల్వే శాఖ అధికార వర్గాలు పేర్కొన్నాయి. తాండూ ర్ ప్రాంతంలో ఉన్న సిమెంటు కర్మాగారాలకు సైతం రైల్వే లైన్ ఉపయోగపడనుంది. అంతే కాకుండా ఆయా ప్రాంతాలకు ప్రయాణికులు రాక పోకలు సాగించేందుకు ఎంతో సౌకర్యంగా మార నుంది. ప్రస్తుతం రైలు, బస్సు సదుపాయాలు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్టు పూర్తయితే ఇరు ప్రాంతాల మధ్య మరింత అభివృద్ధి జరగనుంది.

'డబుల్' ఇళ్లు స్థానికులకే కేటాయించాలి

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్, సర్దార్‌నగర్ గ్రామాల్లో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను మున్సిపాలిటీ పరిధిలోని నిరుపేదలకే కేటాయించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు మున్సిపాలిటీ కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానికంగా నిర్మించిన ఇళ్లను స్థానికులకు కాకుండా నగరంలోని ముస్లింలకు కేటాయించడం సరి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఏకపక్ష నిర్ణయంతో మస్లిస్ పార్టీ, ఇతర ప్రాంతాలకు చెందిన వారికి ఇళ్లను కేటాయించారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తుక్కుగూడ, మహేశ్వరం నియోజకవర్గంలో నిరుపేదలకే డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తునన ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మధుమోహన్, కౌన్సిలర్లు బి.యాదగిరిరెడ్డి, వై.శివకుమార్, బి.విలాస్, ఆర్.రాజు, మున్సిపల్ అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు పాపయ్యగౌడ్, దేవేందర్‌రెడ్డి, జంగయ్య యాదవ్, సుధాకర్, మదన్‌మోహన్, భాస్కర్‌గౌడ్, రవితేజ, నర్సింగ్‌రాజు, సీత్మారెడ్డి, శ్రీనివాస్‌నాయక్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.